


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం వాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| ఆదివారం 09 ఆగస్టు 2026 | పేజిలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :68 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని నాగార్జునసాగర్‌లో వరుణ యాగం

నాగార్జునసాగర్, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళను సంతరించుకోవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పాడిపంటలు సమృద్ధిగా పండాలన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరగనుండగా, యాగం అనంతరం నిర్వహించే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు.




## తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతన నియామకాలు

సంగారెడ్డి, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు శెట్టి అశోక్, జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ సంయుక్త కార్యదర్శి తమ్మాలి సంగమేశ్వర్, జాతీయ ప్రచార కార్యదర్శి కర్చల సంగమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి నాగేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మన్నే పోచయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అందోల్ ప్రాంతానికి చెందిన జె. రాజును సంగారెడ్డి జిల్లా ముఖ్య సలహాదారుగా, డి. సుకుమార్, బి. బాలరాజ్‌లను సంగారెడ్డి జిల్లా సభ్యులుగా, ఎస్. యాదయ్యను అందోల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమించారు. నూతనంగా నియమితులైన పదాధికారులకు జోగిపేట ఏఎస్ఐ దుర్గయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. నూతన పదాధికారులు తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేస్తూ, సంఘం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



## చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే సహించం: వైసీపీ దీక్షలపై చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వైసీపీ నిర్వహిస్తున్న రిలే దీక్షలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరోక్షంగా స్పందించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించబోదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా నిరసనలు చేపట్టడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. బస్టాండ్లు, రహదారులపై నిరసనలు నిర్వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వైసీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షల్లో రౌడీలు తప్ప ఒక్క డీఎస్సీ అభ్యర్థి కూడా లేరని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కర్నూలులో నిరసన చేపట్టిన వారంతా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులేనని తెలిపారు. గతంలో 'గొడ్డలి పార్టీ' చేసిన నష్టం కారణంగానే ఉపాధ్యాయులు తమ ఆత్మగౌరవాన్ని చాటుకున్నారని వ్యాఖ్యానించారు.




## ఇందిరా మహిళా శక్తి భవనం పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. భవనానికి సంబంధించి మిగిలి ఉన్న బ్యాలెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, పెయింటింగ్, ఫినిషింగ్ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భవనం ప్రారంభమైతే జిల్లాలోని మహిళా సంఘాల కార్యకలాపాలు, శిక్షణ కార్యక్రమాలకు ఇది ప్రధాన వేదికగా మారుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిపై మరో కొత్త వంతెన

అమరావతి, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాజధాని అమరావతి–విజయవాడ మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచే దిశగా కృష్ణా నదిపై మరో కొత్త వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. సీతానగరం ఘాట్ నుంచి కనకదుర్గ ఫ్లైఓవర్‌ను అనుసంధానిస్తూ ఈ వంతెనను నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ప్రకాశం బ్యారేజీకి సుమారు 300 మీటర్ల దిగువన వంతెన నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు 1.10 కిలోమీటర్ల పొడవుతో ఆరు వరుసల ఎలివేటెడ్ వంతెనగా దీనిని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. వంతెన అందుబాటులోకి వస్తే అమరావతి–విజయవాడ మధ్య రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ప్రస్తుత రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. రాజధాని ప్రాంతంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన రవాణా అనుసంధానాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తోంది.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా పంట మార్పిడికి రైతులు సిద్ధం కావాలి

సూర్యాపేట, ఆగస్టు 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగినంతగా కురిసే అవకాశం తగ్గుతున్న నేపథ్యంలో జిల్లాలో రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభాలు వచ్చే ఆరుతడి పంటల సాగువైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఎల్‌నినో ప్రభావం–పంట మార్పిడి అవగాహన సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్‌లోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చని, నాగార్జునసాగర్‌లో 312 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 137 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని, ఎస్ఆర్ఎస్పీలోనూ తగినంత నీటి నిల్వలు లేవని తెలిపారు. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరం కాగా కందులు, పెసలు, మినుములు, జొన్న, సజ్జలు, బొబ్బర్లు, అలసందలు, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, కొర్రలు, అండుకొర్రలు, నువ్వులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని వివరించారు. ఒక ఎకరా వరికి సుమారు 44 నుంచి 55 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా పత్తికి 24 నుంచి 28 లక్షల లీటర్లు, కందులు, పెసలు, మినుములకు 11 నుంచి 14 లక్షల లీటర్ల నీరు సరిపోతుందని తెలిపారు. జిల్లాలోని 1,071 చెరువుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, 54 ఐడీసీ లిఫ్టులు పనిచేసే పరిస్థితిలో లేవని పేర్కొన్నారు. వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో తక్కువ కాలంలో చేతికొచ్చే పంటల రకాలను సాగు చేయాలని, పంట మార్పిడితో భూసారం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ప్రభుత్వ పంపిణీ కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆగస్టు 10 నుంచి పది రోజులపాటు "రైతులతో మాట–పంట మార్పిడికి బాట", "ఆరుతడి–మేలైన వ్యవసాయ సాగుబడి" వంటి నినాదాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, ఒక్కో అధికారి కనీసం పది మంది రైతులను ఆరుతడి పంటల సాగువైపు ప్రోత్సహించేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ అధికారుల సూచనలకు సహకరించి పంట మార్పిడి చేపట్టాలని, వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకుని ఆరుతడి పంటల ద్వారా లాభాలు పొందాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నట్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ రంగారావు, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతి నరేష్, ఆర్డీవోలు శ్రీనివాసులు, వేణుమాధవ్, నీటిపారుదల శాఖ సీఈ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో శిరీష, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, డీపీవో యాదగిరి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద విస్తరణకు నీతి ఆయోగ్ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేదానికి మరింత విశ్వసనీయత, గుర్తింపు కల్పించేందుకు నీతి ఆయోగ్ "ప్రపంచీకరణ కోసం ఆయుర్వేద వ్యూహాత్మక రోడ్‌మ్యాప్"ను విడుదల చేసింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన విద్యార్హతలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణమైన తయారీ విధానాలు, అంతర్జాతీయ పరిశోధన భాగస్వామ్యాలు, ఆరోగ్య వ్యవస్థల్లో ఆయుర్వేద సమీకరణకు అవసరమైన చర్యలను ఈ నివేదికలో ప్రతిపాదించింది. ఆధారాలతో కూడిన నాణ్యతా ప్రమాణాలు, నియంత్రణ వ్యవస్థల బలోపేతం ద్వారా ఆయుర్వేదాన్ని ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయ వైద్య విధానంగా నిలబెట్టడమే ఈ రోడ్‌మ్యాప్ లక్ష్యమని నీతి ఆయోగ్ పేర్కొంది.

## జర్నలిస్టుల పాత బస్‌పాస్‌ల గడువు ఆగస్టు 24 వరకు పొడిగింపు


GOVERNMENT OF TELANGANA
INFORMATION AND PUBLIC RELATIONS DEPARTMENT:: HYDERABAD

From,
The Spl. Commissioner,
Information & Public Relations Dept.,
A.C. Guards, Hyderabad.

To,
The Managing Director,
TGSRTC,
Hyderabad.

Letter No. 001218/MR/2026, date: 04.08.2026.

Sir,

Sub:- I&PR Dept., - Media Relations Section – Issue of State and District Journalists bus passes - Reg.
Ref:- 1. This office letter no. 001218/MR/2026, dt. 10.06.2026, 01.07.2026 and 23.07.2026

***

I am to inform that the accreditation cards for the years 2026-2028 are issued to the working journalists at state and district level. The issuing of further cards is still in process. However the old accreditation cards (2024-2026) validity is further extended upto 24.08.2026.

Hence you are requested to extend the validity period of all the old state and district journalists bus passes for (21) days i.e., from 04.08.2026 upto 24.08.2026 without insisting for validity period on the accreditation cards.

Yours Faithfully
Sd/- Dr. G. Mukunda Reddy
Spl. Commissioner

Copy to
The Chairman, Media Academy of Telangana State.
The Regional Joint Director, Multi Zone-I & Multi Zone-II.
All the DPRO's in the State for information and necessary action.

//f.b.o//

హైదరాబాద్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులకు జారీ చేసిన పాత అక్రిడిటేషన్ కార్డుల ఆధారంగా ఉన్న టీఎస్ఆర్టీసీ బస్‌పాస్‌ల గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించాలని సమాచార, పౌర సంబంధాల శాఖ టీఎస్ఆర్టీసీకి సూచించింది. 2026–2028 సంవత్సరాలకు సంబంధించి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, 2024–2026 కాలానికి సంబంధించిన పాత అక్రిడిటేషన్ కార్డుల గడువును ఆగస్టు 24 వరకు పొడిగించినట్లు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాత రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టుల బస్‌పాస్‌ల చెల్లుబాటు గడువును ఆగస్టు 4 నుంచి ఆగస్టు 24 వరకు మరో 21 రోజుల పాటు పొడిగించాలని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరారు. కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తయ్యే వరకు జర్నలిస్టులకు ఇబ్బందులు లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రతులను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రాష్ట్రంలోని అన్ని జిల్లా పౌర సంబంధాల అధికారులకు పంపించారు.

## అసంక్రమ వ్యాధుల నివారణపై నీతి ఆయోగ్ సదస్సు



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అసంక్రమ వ్యాధుల (ఎన్‌సీడీలు) నివారణలో జీవనశైలి ఆధారిత వ్యూహాలపై చర్చించేందుకు నీతి ఆయోగ్ న్యూఢిల్లీలోని రంగ్ భవన్ ఆడిటోరియంలో 34వ ఇన్-హౌస్ లెక్చర్ సిరీస్‌ను నిర్వహించింది. "భారత్‌లో అసంక్రమ వ్యాధుల తగ్గింపు – జీవనశైలి ఆధారిత వ్యూహం" అనే అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ (ILBS) డైరెక్టర్ ప్రొఫెసర్ శివ్ కుమార్ సరిన్ ప్రధాన ఉపన్యాసం అందించారు. కాలేయ ఆరోగ్యం, అసంక్రమ వ్యాధుల ప్రమాద సూచనలు, చికిత్స కంటే నివారణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. కార్యక్రమం ముగింపులో నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అశోక్ కె. లాహిరి నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, ఆధారపూర్వక విధానాల రూపకల్పన అవసరాన్ని నొక్కి చెప్పారు.



## సూర్యాపేట జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా కె. లత బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (డీఎస్సీడీఓ)గా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారిగా శ్రీమతి కె. లత అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్, అదనపు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ సూర్యాపేట జిల్లా డీఎస్సీడీఓగా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించిన కె. లత సమర్థవంతమైన సేవలతో గుర్తింపు పొందారు. మరోసారి ఆమె ఈ బాధ్యతలు చేపట్టడంతో అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకు రాబోయే రోజుల్లో మరింత కృషి చేస్తానని కె. లత పేర్కొన్నారు.

## గిరిజన కుటుంబాలకు చేరువ కావాలి: బీజేపీ ఎస్టీ మోర్చా కార్యవర్గానికి దిశానిర్దేశం



విజయవాడ, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాలు అనే తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి గిరిజన కుటుంబానికి బీజేపీ చేరువ కావాలని సూచించారు. ఎస్టీ మోర్చా ద్వారా గిరిజన సమాజంలోని ప్రతి వర్గాన్ని పార్టీతో అనుసంధానం చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకుని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి జన్మన్ (PM JANMAN) పథకం ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్ల నిధులు కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్‌లోనూ అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని, 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 10,710 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారని, 2024–25లో 32,490 మంది గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందాయని వివరించారు. స్టాండ్ అప్ ఇండియా పథకం ద్వారా గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు గిరిజనులకు రూ.157 కోట్ల విలువైన రుణాలు మంజూరయ్యాయని పేర్కొంటూ, ఎస్టీ మోర్చాను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి




సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో, ప్రాజెక్టుల ద్వారా నీటి విడుదల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో మండలాల వారీగా ఆరుతడి పంటల ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. కంది, పెసర, మినుము, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, మిర్చి, కూరగాయలు, ఆయిల్‌పామ్, ఇతర పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 3,84,489 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, అందులో వరి 2,28,752 ఎకరాలు, పెసర 10,242 ఎకరాలు, కంది 13,258 ఎకరాలు, మినుములు 988 ఎకరాలు, పత్తి 99,728 ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా 2,10,587 ఎకరాల విస్తీర్ణం సాగు చేయాల్సి ఉండగా, ఈ భూముల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. పెసర, కంది విత్తనాలు సబ్సిడీపై మండల వ్యవసాయ అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, ఇతర ఇన్‌పుట్లను సబ్సిడీపై అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని, మరిన్ని మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా అధిక ఆదాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు.




## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను అత్యంత ప్రామాణికంగా రూపొందించాలి

సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలతో రూపొందించాలని జనగణన సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్) భారతి హోళీ కేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నామని, ఇందులో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తామని తెలిపారు. భవిష్యత్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణన విశ్లేషణలకు ఈ హ్యాండ్‌బుక్ ప్రధాన ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖ నుంచి అధికారిక సమాచారాన్ని సేకరించి రెవెన్యూ గ్రామం, పట్టణ స్థాయి వరకు పూర్తి వివరాలను నమోదు చేయాలని, 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, శాఖల సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ, ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు సమాచార నమోదు, పరస్పర పరిశీలన, సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు ధృవీకరణ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సమాచారం ఖచ్చితమైనది, సంపూర్ణమైనది, తాజాదైనది, ఏకరూపమైనది ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పట్టికల్లో తప్పులు, ఖాళీలు, పునరావృత నమోదులు లేకుండా పరిశీలించాలని తెలిపారు. జిల్లా పరిచయంలో భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా నిర్మాణం, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి సూచికలు తదితర అంశాలను పొందుపరచాలని సూచించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జనగణన సంచాలకులు ఇచ్చిన సూచనలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని, సంబంధిత శాఖల నుంచి నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరించి పరిశీలన అనంతరం గడువులోపు రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి. హరి సింగ్, సీపీఓ కిషన్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్‌కు చేరుకున్నందున, ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేసి నష్టపోవద్దని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఎల్‌నినో పరిస్థితులు, ఆరుతడి పంటల సాగు, పౌరసరఫరాల అంశాలపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి మంత్రులు జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటి పరిస్థితిపై మంత్రులు మాట్లాడుతూ ప్రాజెక్టులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్‌కు చేరుకున్నాయని, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఇక సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని తెలిపారు. కమాండ్ ఏరియా రైతులు వరి సాగు కోసం ఎదురుచూడకుండా వరికి బదులుగా పెసలు, కందులు, మినుములు, కూరగాయలు తదితర ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వరి సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, వాస్తవ పరిస్థితులను రైతులకు స్పష్టంగా వివరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షపాతం, రాబోయే వాతావరణ పరిస్థితులను రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని, ప్రాజెక్టుల నుంచి సాగునీరు వచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల్లో నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరినందున తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సోషల్ మీడియా, వీడియో సందేశాలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందిస్తుందని, ఈ విషయాన్ని ఏఈఓలు రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొనగా, జిల్లా నుంచి స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌ఓ ప్రేమ్ రాజ్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, ఉద్యాన అధికారి నాగయ్య, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, జడ్పీ సీఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలి



సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (PMIS)ను జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేసి అర్హులైన యువతకు ఈ పథకం ద్వారా లభించే అవకాశాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించగా, ఈ సందర్భంగా పథకం అమలు, ప్రచార కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పథకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్హులైన యువతకు పథకం ప్రయోజనాలు చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, సూర్యాపేట అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి

సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ (MY Bharat) పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయని, ప్రస్తుతం జిల్లాలో సుమారు 8 వేల మంది యువత నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం చేపట్టి ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాల్లో యువతను విస్తృతంగా భాగస్వాములను చేయాలని, ఈ కార్యక్రమాలపై యువతలో అవగాహన కల్పించాలని సూచించారు. వికసిత్ భారత్ క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ కే. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా యువజన క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి, జిల్లా యువజన అధికారి శశాంక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## మిర్యాలగూడ మండలంలో ఉపసర్పంచ్ పదవి తొలగింపుపై ఊహాగానాలు

మిర్యాలగూడ, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మిర్యాలగూడ మండలంలోని ఓ గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ పదవి తొలగింపునకు సంబంధించిన వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఉపసర్పంచ్ పదవికి సంబంధించి కీలక పరిణామాలు చోటుచేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై సంబంధిత అధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఉపసర్పంచ్ పదవి తొలగింపునకు గల కారణాలు, అధికారిక నిర్ణయం, తదుపరి చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక సమాచారం అందిన అనంతరం ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## బావిలో సముద్ర అలల్లా నీటి కదలికలు.. గుజరాత్ గ్రామంలో వింత ఘటన



విర్పర్దా (గుజరాత్), ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గుజరాత్‌లోని విర్పర్దా గ్రామంలో ఓ బావిలో నీరు సముద్ర అలల్లా కదులుతుండటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రైతు ప్రాంజీవన్ భాయ్ పొలంలోని ఈ బావిలో మంగళవారం కొంతసేపు నీటి కదలికలు తగ్గినప్పటికీ, బుధవారం మళ్లీ ప్రారంభమయ్యాయి. రాతి పొరల మధ్య చిక్కుకున్న వాయువుల ఒత్తిడి కారణంగానే ఈ తరహా కదలికలు ఏర్పడి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. అసలు కారణాలను గుర్తించేందుకు నిపుణులతో పరిశీలనలు చేపట్టినట్లు వెల్లడించారు. బావిలో చోటుచేసుకున్న ఈ వింత దృశ్యాన్ని చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.




## ప్రజలకు మెరుగైన వైద్య, విద్య, తాగునీటి సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి, ఆగస్టు (సందేశం టైమ్స్ ప్రతినిధి): జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసి వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో నకిలీ వ్యక్తి విధులు నిర్వహించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట పీహెచ్‌సీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎంసీహెచ్‌ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలలో తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు మెరుగుపర్చాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంజీర, సింగూరు ప్రాజెక్టుల నీటి మట్టాలు, తాగునీటి సరఫరా పరిస్థితిపై సమీక్షించి, వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ముందస్తుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## చేనేత కళకు ఆదరణ పెంచి చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

సంగారెడ్డి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీని అడిషనల్ కలెక్టర్ పాండు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు చేనేత కార్మికుల కళానైపుణ్యానికి తగిన గుర్తింపు కల్పించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, ప్రోత్సాహక పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. చేనేత రంగం భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తున్న కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా చేనేత కార్మికులకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ర్యాలీలో హ్యాండ్లూమ్ శాఖ సహాయ సంచాలకులు వెంకట్రావు, జిల్లా అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల విద్యాలయాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రకటన

తేది: 06 .08.2026

సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ / అధ్యాపకులుగా 2026-27 విద్యా సం. లో తాత్కాలికంగా ( పార్ట్ టైమ్ ) గా పనిచేయుటకు అర్హతలు కలిగి ఇంగ్లీష్ మీడియం లో బోధించగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుచున్నాము.

ఖాళీ పోస్టుల వివరాలు : డిగ్రీ లెక్చరర్స్ : డిగ్రీ కళాశాల సంగారెడ్డి నందు డిగ్రీ లెక్చరర్ కంప్యూటర్ సైన్స్ 01, ఎకనామిక్స్ 01, పొలిటికల్ సైన్స్ 01, హిస్టరీ 01, బోటనీ 01, ఫిజిక్స్ 01.

జూనియర్ లెక్చరర్స్ : ప్రతిభా కళాశాల (బాలురు ) నందు జూనియర్ లెక్చరర్ కామర్స్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు) మనూర్ ఎట్ కరాస్ గుత్తి నందు జూనియర్ లెక్చరర్ మాథ్స్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) నారాయణఖేడ్ నందు జూనియర్ లెక్చరర్ జువాలజీ 01.

పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (PGT): పాఠశాల & జూనియర్ కళాశాల [illegible] (బాలికలు) నందు పిజిటి మాథ్స్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) కాంగ్టి Kangti నందు పిజిటి ఫిజికల్ సైన్స్ 01, పిజిటి బయో సైన్స్ 01, పిజిటి సోషల్ స్టడీస్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు) మనూర్ ఎట్ కరాస్ గుత్తి నందు పిజిటి సోషల్ స్టడీస్ 01.

ట్రైనడ్ గ్రాడ్యుయేట్ టీచర్ టిజిటి (TGT): పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) నారాయణఖేడ్ నందు టిజిటి ఇంగ్లీష్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) కాంగ్టి Kangti నందు టిజిటి ఇంగ్లీష్ 01, టిజిటి సోషల్ స్టడీస్ 01. పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) [illegible] నందు టిజిటి మాథ్స్ 01, పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు) మనూర్ ఎట్ కరాస్ గుత్తి నందు టిజిటి మాథ్స్ 01. టిజిటి సోషల్ స్టడీస్ 02. పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు) [illegible] నందు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (PD): 01.

విద్యార్హతలు: డిగ్రీ లెక్చరర్: సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలి అదే సబ్జెక్టులో పిహెచ్.డి./నెట్ (NET)/సెట్ (SET) అర్హత కలిగిన వారికి వరుసగా ప్రాధాన్యత ఇవ్వబడును, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పిజిటి (PGT): సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్ తో పాటు బి.ఎడ్. ఉత్తీర్ణులై ఉండాలి, ట్రైనడ్ గ్రాడ్యుయేట్ టీచర్ టిజిటి (TGT): సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బి.ఎడ్. ఉత్తీర్ణులై ఉండాలి, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (PD): ఏదైనా డిగ్రీతో పాటు బి.పి.ఎడ్. /బి.పి.ఈ.డి. ఉత్తీర్ణులై ఉండాలి.

అర్హత గల అభ్యర్థులు నేరుగా రీజినల్ కోఆర్డినేటర్, గిరిజన సంక్షేమ గురుకుల కార్యాలయం, మానసాహిల్స్ రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా నందు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు రెండు జిరాక్స్ సెట్స్ తో డెమో మరియు ఇంటర్వ్యూకు తేది ______________ ఉదయం 9.00 గం. లకు హాజరు కాగలరు. బాలికల విద్యాలయాల్లో కేవలం మహిళాఅభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించబడును. మరిన్ని వివరాలకు DCO- సంగారెడ్డి జిల్లా : 9849237238. సంప్రదించగలరు.

రీజినల్ కోఆర్డినేటర్,
గిరిజన సంక్షేమ గురుకుల కార్యాలయం
సంగారెడ్డి జిల్లా.

సంగారెడ్డి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక (పార్ట్‌టైమ్) ప్రాతిపదికన ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ తెలిపారు. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ), ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజిక్స్, కామర్స్, మ్యాథ్స్, జువాలజీ, బయో సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్ తదితర సబ్జెక్టుల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సంబంధిత పోస్టులకు అవసరమైన విద్యార్హతలు కలిగి, ఇంగ్లిష్ మాధ్యమంలో బోధించగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లతో రీజినల్ కోఆర్డినేటర్, గిరిజన సంక్షేమ గురుకుల కార్యాలయం, మానసాహిల్స్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. బాలికల విద్యాసంస్థల్లో మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ) సంగారెడ్డి 9849237238 నంబర్‌ను సంప్రదించాలని రీజినల్ కోఆర్డినేటర్ సూచించారు.



## ఆగస్టు 10లోగా ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

సంగారెడ్డి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ సంగీత తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 10లోగా ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను ప్రచురించనున్నామని, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఏఎస్‌డీ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,633 పోలింగ్ స్టేషన్లను రేషనలైజేషన్ అనంతరం 1,649కు పెంచే ప్రతిపాదన చేసినట్లు, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ సగటున 79 శాతం పూర్తైందని పేర్కొంటూ నారాయణఖేడ్‌లో 88 శాతం, ఆందోల్‌లో 87 శాతం, జహీరాబాద్‌లో 82 శాతం, సంగారెడ్డిలో 80 శాతం, పటాన్‌చెరులో 67 శాతం పురోగతి నమోదైందని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా సహకరించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు

సంగారెడ్డి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండలం ఇంద్రేశం, పెద్దకంజర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, భూ హక్కులు, అటవీ హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఆర్థికంగా బలహీన వర్గాలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల ద్వారా త్వరితగతిన న్యాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల హక్కులు, బాలల హక్కులు, పోక్సో చట్టం, గృహహింస నిరోధక చట్టం, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ర్యాగింగ్ నిరోధం, బాధితుల పరిహార పథకం, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులపై కూడా వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో అన్యాయాలను ఎదుర్కొనేలా చైతన్యవంతులుగా ఉండాలని, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులను హార్టికల్చర్, ఆయిల్‌పామ్, ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులు హార్టికల్చర్, ఆయిల్‌పామ్, ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. వానాకాలం పంటల సాగు, స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాగు చేయాల్సిన పంటలపై స్పష్టమైన సూచనలు అందించాలని, కాలువల కింద వరి సాగు వల్ల భవిష్యత్తులో సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాలు నిర్వహించి రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు చేసేలా అధికారులు ప్రోత్సహించాలని ఆదేశించారు. వనమహోత్సవం లక్ష్యాలను పూర్తి చేసి నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, కొత్త పెన్షన్ల మంజూరుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండాయని, రైతులు ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది పంటలు సాగు చేస్తున్నారని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు పాఠశాలలో వివిధ కమిటీల ఏర్పాటు





అనంతగిరి, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జడ్పీహెచ్ఎస్ అనంతగిరి పాఠశాలలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, అంకితభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో వివిధ విద్యార్థి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సలీమా మాట్లాడుతూ విద్యార్థుల్లో బాధ్యతాయుత భావన, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి ఏడాది కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఉపాధ్యాయులు వసీం ఆధ్వర్యంలో కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకారావు, బాలరాజు, సైదులు, లక్ష్మి, నాగేందర్ రెడ్డి, మస్తాన్, జానకి, రాములు, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.




# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కే. నరసింహతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఆహ్వాన పత్రికల పంపిణీ, వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, మున్సిపాలిటీ ద్వారా తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని, సీపీఓ ఉపన్యాస ప్రతులను సిద్ధం చేయాలని, అగ్నిమాపక శాఖ భద్రతా పరికరాలతో సిద్ధంగా ఉండాలని, విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సమాచార పౌర సంబంధాల శాఖ పబ్లిక్ అడ్రస్ సిస్టం, వీడియో కవరేజి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, డీపీఓ యాదగిరి, డీఈవో అశోక్, ఆర్డీవో వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హనుమంతరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బోనాల జాతర ఏర్పాట్లలో విషాదం.. కరెంట్ షాక్‌తో యువకుడి మృతి



నర్సాపూర్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి వి. సాయి): మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో బోనాల జాతర ఏర్పాట్ల సందర్భంగా విషాద ఘటన చోటుచేసుకుంది. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ తీగ తగిలి కరెంట్ షాక్‌కు గురైన మల్పర్తి హర్షవర్ధన్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడగా వారిని వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి




నడిగూడెం, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న కోదాడలో నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో అఖిల భారత కిసాన్ సభ, సీఐటీయూ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రుణ విమోచన చట్టం తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు, నూతన విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించే చర్యలను విరమించుకోవాలని కోరుతూ జైల్ భరో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మండల కమిటీ సభ్యుడు ఎస్కే లతీఫ్ బాబు అధ్యక్షత వహించగా, బీరవెల్లి సుధాకర్ రెడ్డి, ఎస్కే మస్తాన్, కేశగాని భద్రయ్య, సంపత్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయం వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టిన 14వ వార్డు కౌన్సిలర్



పటాన్‌చెరు, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ వి. సాయి): పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ ఆలయం వద్ద బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 14వ వార్డు రాచమల్ల శ్రీనివాస్ గౌడ్ తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. వచ్చే ఆదివారం జరగనున్న బోనాల పండుగకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉండటంతో వర్షాల కారణంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ మట్టి రోడ్లు వేయించి, డోజర్ సహాయంతో ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. భక్తులు సంతోషంగా అమ్మవారి బోనాల పండుగను నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# నాగులవంచ హాస్టల్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ






ఖమ్మం, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): చింతకాని మండలం నాగులవంచ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, చెడు ప్రవర్తనకు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో మంచి ఫలితాలు సాధించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బాధ్యులు రాజయోగి అరుణ, గోవిందాచార్యులు, సురేష్ పాల్గొన్నారు. అలాగే వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు, సిబ్బంది దిలీప్ కుమార్, మహేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


# ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి







నడిగూడెం, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న కోదాడలో నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో అఖిల భారత కిసాన్ సభ, సీఐటీయూ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రుణ విమోచన చట్టం తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు, నూతన విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించే చర్యలను విరమించుకోవాలని కోరుతూ జైల్ భరో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మండల కమిటీ సభ్యుడు ఎస్కే లతీఫ్ బాబు అధ్యక్షత వహించగా, బీరవెల్లి సుధాకర్ రెడ్డి, ఎస్కే మస్తాన్, కేశగాని భద్రయ్య, సంపత్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


# బోనాల ఏర్పాట్లను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



పటాన్‌చెరు, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ బి. డేవిడ్): రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఆదివారం జరగనున్న ఆషాఢమాస బోనాల పండుగ ఏర్పాట్లను తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పరిశీలించారు. శుక్రవారం ఉదయం ఓల్డ్ రామచంద్రపురంలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన ఆమె, బోనాల ఉత్సవాలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయించడం, ఆలయం ముందు భాగంలో డస్ట్ వేయించడం, లైటింగ్ ఏర్పాట్లు చేయించడం వంటి పనులను సీఎంసీ శానిటేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ నగర్ కాలనీ, కసిరెడ్డిపల్లి, మల్లికార్జున నగర్, రామచంద్రారెడ్డి నగర్, మయూరి నగర్, కనుకుంట ప్రాంతాల్లో కూడా బోనాల ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



మెదక్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్‌హెచ్-44 నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. బంగారమ్మ టెంపుల్, కుచారం గ్రామం వద్ద ఉన్న బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించిన ఎస్పీ ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామిక ప్రాంతాలు అధికంగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయని, ముఖ్యంగా వాహనాలు యూటర్న్ తీసుకునే ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎన్‌హెచ్ఏఐ రీజినల్ మేనేజర్ రంగారావుతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, డివైడర్ ఓపెనింగ్‌లు, గ్రామాల అనుసంధాన రహదారుల వద్ద వాహనాల రాకపోకలకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

# జోగిపేట ఏరియా ఆసుపత్రి ఘటన.. డాక్టర్ రమేష్‌పై సస్పెన్షన్ వేటు



అందోల్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్ (జనరల్ మెడిసిన్)గా పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 5వ తేదీన తన విధులకు డాక్టర్ రమేష్ గైర్హాజరై, తన స్థానంలో మరో వ్యక్తితో వైద్య సేవలు అందించిన ఘటనపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలడంతో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ రమేష్ స్థానంలో విధులు నిర్వహించిన వ్యక్తిని రవిగా గుర్తించినట్లు సమాచారం. అతను సదాశివపేటలో డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యుడి స్థానంలో ప్రైవేటు వ్యక్తి వైద్య సేవలు అందించిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించగా, విచారణ అనంతరం డాక్టర్ రమేష్‌పై చర్యలు తీసుకున్నారు.




## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): ఈ నెల 15న నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు గ్రౌండ్, డయాస్‌ను పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పూల అలంకరణలతో సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలకు అవసరమైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే స్టాళ్లు, శకటాల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన ప్రగతి సందేశాన్ని సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళిక అధికారిని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మెదక్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వేడుకలకు వచ్చే ప్రజలు, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, జాతీయ భావాన్ని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ పార్కింగ్, బారికేడ్లు, బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతతో సమాచారం పక్కాగా సేకరించాలి: రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి

మెదక్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీకి సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నాణ్యతతో, పక్కాగా సేకరించాలని రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు భారతి హోళికేరి ఆదేశించారు. జనగణన–2027 సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ) సమాచార సేకరణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనాభా లెక్కల సంచాలకులు మాట్లాడుతూ ప్రతి జిల్లాకు సంబంధించిన జనగణన హ్యాండ్‌బుక్‌ను సమగ్రంగా రూపొందించేందుకు విద్య, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, తయారీ, చేతివృత్తులు తదితర అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గ్రామాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలు, పరిశీలనలు, పట్టణాల సమాచారాన్ని కూడా నమోదు చేయాలని ఆదేశించారు. టౌన్ డైరెక్టరీ షెడ్యూల్‌కు సంబంధించి పట్టణ పౌర, పరిశ్రమలు, సామాజిక సదుపాయాలు, మురికివాడలకు సంబంధించిన సమాచారాన్ని ఛార్జ్ ఆఫీసర్లు నియమించిన అధికారులు సేకరించాలని తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారాన్ని జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఛార్జ్ ఆఫీసర్లకు అందించాలని సూచించారు. డీసీహెచ్‌బీ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల సమాచారాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని తెలిపారు. విలేజ్ డైరెక్టరీ సమాచారాన్ని 31.12.2025ను ప్రామాణిక తేదీగా తీసుకుని రెవెన్యూ గ్రామాల వారీగా సేకరించాలని, ఈ ప్రక్రియను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ఈవీఎం గోదాం నెలవారీ తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, ఆగస్టు 9 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ నెలవారీ తనిఖీ నిర్వహించారు. శుక్రవారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం సీల్‌ను తనిఖీ చేయడంతో పాటు సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించి ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ 24 గంటల పాటు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ హార్దీప్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## చిలుకూరు జడ్పీహెచ్ఎస్‌కు రూ.లక్ష విరాళం ప్రకటించిన రిటైర్డ్ టీచర్ విజయలక్ష్మి

సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి ఆగస్టు, 09, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు పొందూరు రామయ్య గారి జ్యేష్ఠ పుత్రిక, ఎస్ఎస్ సోషల్ స్టడీస్ రిటైర్డ్ టీచర్ శ్రీమతి పొందూరి విజయలక్ష్మి తాను చదువుకున్న చిలుకూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధి కోసం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళంపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె సోదరులు పొందూరు సత్తిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారావు, కోదండరామయ్య, కైలాసం, వెంకటేశ్వర్లు, కస్తూరి అప్పారావు, హమీదా, శామ్ సెన్సార్, సత్యనారాయణ టీచర్ తదితరులు పాల్గొన్నారు. తాను చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా పేద వర్గాల విద్యార్థుల ప్రయోజనం కోసం విజయలక్ష్మి గారు అందించిన విరాళం ఆమె దాతృత్వానికి నిదర్శనమని పలువురు అభినందించారు. పూర్వ విద్యార్థులు కూడా తమ వంతు సహకారాన్ని పాఠశాలకు అందించాలని ఈ సందర్భంగా కోరారు.

## తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధ్యం



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు, 09, వాతావరణ మార్పులు, ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను చేపట్టి అదనపు ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనూహ్య మార్పులు, ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పంటల దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణను అవలంబించడం ద్వారా వ్యవసాయ నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. ఉద్యాన పంటల సాగుతో పాటు తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అనుబంధ రంగాలు రైతు కుటుంబాలకు స్థిరమైన అదనపు ఆదాయాన్ని అందిస్తాయని తెలిపారు. తేనెటీగల పెంపకం ద్వారా తేనె ఉత్పత్తితో ఆదాయం పొందడమే కాకుండా పంటల్లో పరాగసంపర్కం మెరుగుపడి పండ్లు, కూరగాయల దిగుబడులు, నాణ్యత పెరుగుతాయని వివరించారు. పుట్టగొడుగుల సాగు తక్కువ స్థలంలో, తక్కువ పెట్టుబడితో, తక్కువ వ్యవధిలో అధిక లాభాలు అందించే ఉపాధి మార్గమని, గ్రామీణ యువత, మహిళా సంఘాలు, చిన్న సన్నకారు రైతులకు ఇది ఎంతో అనుకూలమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు సంప్రదాయ వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాకుండా ఆదాయాన్ని పెంచే అనుబంధ రంగాలను స్వీకరించాలని సూచించారు. ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సూక్ష్మ సేద్యం, సంరక్షిత సాగు, ఉద్యాన పంటల విస్తరణ, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు వంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక శిక్షణలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు ఉద్యాన శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తేనెటీగల పెంపకం నిపుణురాలు ఇందిరా రెడ్డి తేనెటీగల కాలనీల సంరక్షణ, తేనె సేకరణ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. తునికి పాలిటెక్నిక్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేష్ పుట్టగొడుగుల సాగులో అవసరమైన మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ సాగు విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తేనెటీగల పెంపకం యూనిట్లు, పుట్టగొడుగుల ఉత్పత్తి విధానాలను పరిశీలించి నిపుణులను ప్రశ్నించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని లాభదాయకంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం మరువలేనిది: కలెక్టర్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు, 09,మెదక్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నరసింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులను శాలువాలతో సన్మానించారు. అనంతరం పాత్రికేయులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పాత్రికేయులు పనిచేస్తున్నారని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఏ. శంకర్ దయాళ్ చారి, జిల్లా ప్రతినిధులు శ్రీధర్, అశోక్, ఫారూక్ హుస్సేన్, రియాజ్, రహ్మత్, కామాటి కృష్ణ, చింతల రమేష్, శ్రీహరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి: సీఐటీయూ పిలుపు

జోగిపేట సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 9, కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జోగిపేట బస్టాండ్‌లో ప్రచార జాతను ప్రారంభించి అనంతరం వివిధ గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా కొనసాగించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలపై భారాలు మోపే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, బషీర్, వెంకటేశం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు అండగా భరోసా కేంద్రం.. నాలుగేళ్లుగా మహిళలు, చిన్నారులకు సమన్వయంతో సేవలు

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు, 09,మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహాయాన్ని ఒకే వేదికపై అందిస్తున్న భరోసా కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ హాజరై కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా భరోసా కేంద్రం మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాల బాధితులకు అండగా నిలుస్తూ వారికి అవసరమైన కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సహాయం, పునరావాస సేవలను సమన్వయంతో అందిస్తోందన్నారు. నేరం జరిగిన తర్వాత బాధితులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, భయాందోళనలను అధిగమించేలా వారికి ధైర్యం కల్పించడంతో పాటు న్యాయం పొందే వరకు అవసరమైన సహకారం అందించడం భరోసా కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాధితుల గోప్యత, గౌరవానికి ప్రాధాన్యతనిస్తూ సున్నితమైన విధానంతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు సత్వర సహాయం అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ బాధితులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని అదనపు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుచరిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తాలెల్మలో ఘనంగా ముదిరాజ్ కులబంధువుల బోనాల జాతర

అందోల్ ఆగస్టు 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి),అందోల్ మండలంలోని తాలెల్మ గ్రామంలో ముదిరాజ్ కులబంధువుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పి. నారాయణ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ లింగాగౌడ్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు పండించిన పంటలు చేతికొచ్చి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ బోనాల ఉత్సవాల్లో బోయిని సత్యం, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.



## వరి పంటలో జీవ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

సందేశం టైమ్స్ వట్‌పల్లి ప్రతినిధి సిహెచ్ బస్వరాజు ఆగస్టు 9,వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్ గ్రామంలో వరి పంటలో పీఎస్‌బీ (ఫాస్ఫేట్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా), ట్రైకోడెర్మా విరిడే వినియోగం, నీమాశ్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు జీవ ఎరువుల ప్రాముఖ్యత, విత్తన శుద్ధి విధానం, నేలలో వాటి వినియోగం గురించి రైతులకు వివరించారు. ట్రైకోడెర్మా విరిడే జీవ నియంత్రణ కారకంగా పనిచేసి నేల ద్వారా వచ్చే శిలీంధ్ర తెగుళ్లను నియంత్రించడంలో సహాయపడుతుందని, పీఎస్‌బీ నేలలో అందుబాటులో లేని ఫాస్ఫరస్‌ను మొక్కలకు అందుబాటులోకి తీసుకువస్తుందని తెలిపారు. నీమాశ్రం తయారీ విధానం, దాని వినియోగం వల్ల నేలలో సూక్ష్మజీవుల కార్యకలాపాలు పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి జీవ ఆధారిత సాగు పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి పరిమళ, కృషి సఖీలు సురేఖ, అనురాధతో పాటు ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన వరి సాగు రైతులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన జయమ్మ మాతాజీ



బీడకన్య, సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 9, సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బీడకన్య గ్రామ మాజీ సర్పంచ్ మొల్గిరి సంజీవులు మృతి చెందిన విషయం తెలుసుకున్న శ్రీశ్రీశ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ హుటాహుటిన గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. జయమ్మ మాతాజీతో పాటు భక్తబృందం సభ్యుడు శివన్న పాటిల్ పాల్గొన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి పరామర్శించడం జయమ్మ మాతాజీ ప్రత్యేకత అని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామానికి చేరుకున్న జయమ్మ మాతాజీకి స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికి, ఆమె సేవాభావాన్ని అభినందించారు.

## అనారోగ్య బాధతో బావిలో దూకి మాజీ సర్పంచ్ మృతి



ఝరాసంగం మండలం, సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 9,సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బీడకన్య గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంజీవరావు (55) అనారోగ్య బాధ తాళలేక బావిలో దూకి మృతి చెందిన విషాద ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రోజువారీ అలవాటులో భాగంగా సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో తన సొంత వ్యవసాయ పొలం వద్దకు వాకింగ్‌కు వెళ్లిన సంజీవరావు అక్కడ ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో పాటు చెవి నొప్పితో తీవ్రంగా బాధపడుతూ, ఆ బాధను భరించలేకపోతున్నానని కుటుంబ సభ్యులకు పలుమార్లు చెప్పినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య సంధ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

